
జులై - ఆగష్టు, 2012

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక





# “మనస్సులోని మాట”

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

క్రీస్తునందు ప్రియులైన స్వర్శ పాఠకులకు దేవుని నామములో వందనములు. ప్రభువు మనలను 2012వ సంవత్సరము సగం కాలము కాపాడి క్షేమమును, నెమ్మదిని అనుగ్రహించినందుకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించవలెను. మహా దేవుడు, మన రక్షకుడు అయిన యేసుక్రీస్తు నందు మనం ఎల్లప్పుడు ఆనందించవలెను. అంత్య దినములలో అపాయకరమైన కాలములో మనము ఉన్నాము అని ఎరిగి మనస్సాక్షిని కాపాడుకోవలసిన అవసరం ఉంది.

మనుష్యులు స్వార్థప్రియులు, ధనాపేక్షులు, బింకములాడువారు, అహంకారులు, దూషకులు, తల్లిదండ్రులకు అవిధేయులు, కృతజ్ఞతలేనివారు, అపవిత్రులు, తమ జీవితములను గూర్చి తప్ప ఎదుటి వారి గూర్చి ఏమాత్రము ఆలోచించని స్వార్థపరులు విస్తరించిన కాలములో మనము ఉన్నాము. నిస్వార్థముగా ఎవరైనా ఉన్నప్పటికీ దానిని నమ్మలేనంతగా స్వార్థము అనే మత్తుతో మనుష్యులు జీవిస్తున్నారు. వీటి విషయమై బోధించి ప్రజలను సరియైన దారిలో నడిపించవలసిన ఆత్మీయ నాయకులు సహితము స్వార్థములో కూరుకొనిపోవడం చాలా దుఃఖకరమైన విషయం. అందుకే పౌలు తన తోటి సేవకుడైన తిమోతిని పైన చెప్పబడిన వాక్యములతో హెచ్చరించడం జరిగింది.

ఒక ప్రాముఖ్యమైన విషయము ఏదనగా ప్రజలకు మాదిరికరమైన నాయకత్వం లేని లోపం స్పష్టముగా కనబడుచున్నది. కనుక దేవునిలో ముందుకు కొనసాగుతున్న మీరు మన చుట్టూ వున్నవారిలో మనలను క్రమముగా నడిపించగలిగిన నాయకులతో కలిసి పనిచేయుటకు సిద్ధముగా ఉండవలయును. దేవుని పని ఎప్పుడు ఏ ఒక్కరితో జరిగేది కాదు. ఇది ఒక టీమ్ వర్క్ కనుక ఒకరి భారములను ఒకరు భరించుకొంటూ కొన్నిసార్లు మనం ఒక్కరమే ఎక్కువ కష్టపడుతున్నాము అనిపించినప్పటికి, ప్రేమను కాపాడుకుంటూ ఒక అత్యున్నతమైన ఉద్దేశం కొరకు పని చేస్తున్నామనే సంగతి ఎల్లప్పుడు జ్ఞాపకం ఉంచుకోవాలి.

దేవుడు మిమ్ములను మీ కుటుంబములను దీవించును గాక ! ఆమెన్

మీ సహోదరుడు.....

జూలై - ఆగష్టు, 2012

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక


## ఈ సంచికలో...


- ఆశీర్వాదము ........ 2
- జొనాతన్ ఎడ్వర్డ్స్ ........ 6
- దేవుడు చూచెను (స్త్రీల ప్రత్యేకం) ........ 8
- అపోహలు ........ 10
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 23వ భాగము ........ 11
- నిజం - నిప్పు (బాలల శీర్షిక) ........ 13
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 15
- మానసిక భావోద్రేకపరమైన స్వస్థతలు ........ 17
- ప్రార్థన ఊపిరి పీల్చుట వంటిదే ........ 19
- నదులు ........ 21
- బైబిల్ క్విజ్-23 ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# ఆశీర్వాదము

- బ్రదర్ ఎపఫ్రా



ఆశీర్వాదము అనే మాట ప్రతి మనిషికి ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది. అందుకే మనుష్యులు ఆశీర్వాదము కొరకు గుళ్ళు, గోపురములు, చర్చిలు అని ఆధ్యాత్మిక కేంద్రముల వెంట తిరుగుతూ ఉంటారు. పుణ్యక్షేత్రముల చుట్టూ తిరగటం ద్వారా ఆశీర్వాదమును సంపాదించు కోగలమా? మరి ముఖ్యముగా మన దేశంలో ఆశీర్వాదం అనే పేరుతో అమాయక ప్రజలను ఎంతోమంది మోసం చేయడం చూస్తూ ఉంటాము. సృష్టించిన సృష్టికర్త తప్ప ఎవరూ ఒక మనిషిని ఆశీర్వదించలేడు. ఒకరోజు సృష్టికర్త అయిన దేవుడు పాదము పట్టునంత భూమి అయిననూ లేనప్పుడు నీ తరువాత నీ సంతానమునకు ఈ దేశమును ఇస్తానని అబ్రాము అనే వ్యక్తికి వాగ్దానము చేసాడు, ఆ తరువాత వాగ్దానము నెరవేర్చాడు. ఎందుకు దేవుడు ఆ వాగ్దానమును నెరవేర్చాడు, అతనిలో ఉన్న ప్రత్యేకత ఏమిటి? అని పరిశీలించినప్పుడు అబ్రాము కొన్ని ప్రత్యేకమైన లక్షణములను కలిగి ఉన్నాడు. అవి దేవునికి ఎంతో ప్రీతికరమైనవి. అబ్రాము నోవహు పెద్ద కుమారుడైన షేము వంశావళిలో నుండి వచ్చిన తెరహు కుమారుడు.

అబ్రాము జీవితములోని కొన్ని ప్రత్యేకలక్షణములను పరిశీలిద్దాము:-

**1. విధేయత చూపించుట :-** అబ్రాము తండ్రి ఇంటిలో మొదటిగా పుట్టినవాడు. నీవు లేచి నీ దేశము నుండియు, నీ బంధువుల యొద్ద నుండియు, నీ తండ్రి ఇంటి నుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్లుము (ఆది 12:1) అని చెప్పినప్పుడు అబ్రాము మారు మాట్లాడక, వెంటనే ఆ ప్రాంతము నుండి బయలుదేరి వెళ్లాడు. దేవుడు చెప్పిన మాటకు అబ్రాము విధేయత చూపించాడు.

**2.ప్రార్థించుట :-** అబ్రాము దేవుని మాట చొప్పున బయలుదేరి వెళ్ళుచూ బేతేలుకు, హాయికి మధ్యలో గుడారము వేసికొనెను. అక్కడికి చేరిన వెంటనే ఆ ప్రదేశము, ప్రజలు ఎలాంటి వారో తెలుసుకుందామని ప్రయత్నించ లేదు కానీ తనకు ప్రత్యక్షమై, వాగ్దానము చేసిన దేవునికి బలిపీఠమును కట్టి, ఏం చేయాలో తెలియని పరిస్థితులలో యెహోవా నామములో ప్రార్థన చేసెను. మన కష్ట సమయములలో దేవుని సన్నిధిలో, యెహోవా నామమున ప్రార్థన చేసేవారిగా ఉండాలి. మనలను మనము ఆయనకు అప్పగించుకొని, ప్రార్థించినప్పుడు అబ్రాముకి సహాయం చేసిన దేవుడు తప్పక మనకి సహాయం చేస్తారు.

**3. సమాధానమును కోరుకొనుట :-**



దేవుని చేత ఆశీర్వదించబడి, ఆస్తి విస్తరించుట వలన అబ్రాము ధనవంతుడయ్యాడు. అప్పుడు అబ్రాము గొర్రెల కాపరులకు, లోతు గొర్రెల కాపరులకు కలహము జరిగినందున అబ్రాము మనము బంధువులము గనుక నాకును నీకును, నా పశువుల కాపరులకు, నీ పశువుల కాపరులకు కలహముండ కూడదు, దయచేసి నన్ను విడిచి వేరుగా ఉండుము అని లోతుతో చెప్పాడు. అబ్రాము సమాధానము కలిగి జీవించాలనే ఆలోచనతో అట్టి జీవితమును కోరుకున్నాడు. అంతేకాదు అబ్రాము తన తమ్ముడి కుమారుడైన లోతుతో నీవు ఎడమ తట్టునకు వెళ్లిన యెడల, నేను కుడితట్టునకును, నీవు కుడి తట్టునకు వెళ్లిన యెడల నేను ఎడమ తట్టుకును వెళ్లుదునని చెప్పెను (ఆది 13:9)

ఇక్కడ అబ్రాము అచంచలమైన విశ్వాసము గలవాడిగా కనబడుచున్నాడు. అంతేకాక గొడవలు పెట్టుకొనక, సమాధానమును కోరుకునే మనస్సుతో జీవిస్తున్నాడు. లోతు వెళ్లిపోయినవెంటనే దేవుడు అబ్రాము యొక్క మంచి మనస్సును చూచి ఏం చేశాడో చూసారా! నాలుగువైపులా చూడు, దీనినంతటిని నీకును, నీ సంతానమునకును ఇస్తానని వాగ్దానం చేసాడు. నాలుగువైపులా అంటున్నాడు మరి లోతు ఎక్కడ? దేవుని మనస్సులో లోతు లేడని దీనిని బట్టి అర్థం అవుతుంది. కాబట్టి సమాధానమును కోరుకొనువాడు తెలివితక్కువ వాడుగా కనిపించినా చివరికి పైచేయి సాధిస్తాడు.

సమాధానకరమైన మనస్సు మంచి ఆరోగ్యమును, సంతోషకరమైన హృదయమునకు కలుగజేస్తుంది కనుక గొడవలు పెట్టుకునే మనస్తత్వం కాక, సమాధానకరమైన మనస్సు కలిగి దేవుని ఆశీర్వాదమును కలిగివుందాము.

**4. శత్రువుని క్షమించుట :-**

తమ్ముడి కుమారుడైన లోతు వచ్చిన అవకాశమును ఉపయోగించుకొని, యెహోవా తోట వలె కనబడుచున్న పచ్చని ప్రదేశమును ఎంచుకొని వెళ్లిపోయాడు. ఆ సొదొమ, గొమొఱ్ఱా ప్రాంతముల మీద శత్రురాజులు దాడి చేసి లోతును, లోతు ఆస్తిని, స్త్రీలను పట్టుకుపోయారనే వార్తను విన్న అబ్రాము వెంటనే తన దగ్గర ఉన్న దాసులను వెంటబెట్టుకొని పోయి, శత్రువులను జయించి లోతును, ఆస్తిని, స్త్రీలను కాపాడెను.

లోతు అబ్రాముతో కూడా వచ్చిన వాడు. అబ్రాము పశువుల కాపరుల గురించి చెప్పినపుడు కానీ, వెళ్లమన్నప్పుడు కానీ నాదేముంది, నేను నీ వెంట వచ్చిన వాడను, నువ్వు ఎలా చెబితే అలా వింటాను అని అనకపోగా, ఇదే అవకాశం అన్నట్లుగా వెళ్లిపోయాడు.



శత్రువు వలె ప్రవర్తించిన తన తమ్ముడి కుమారుడిని క్షమించి, సహాయము చేశాడు అబ్రాము.

**5. దశమ భాగం చెల్లించుట :-**

శత్రువులను జయించి, అబ్రాము తిరిగి వచ్చుచున్నప్పుడు షాలేము రాజైన మెల్కీసెదెకు అను యాజకుడు రొట్టె, ద్రాక్షారసముతో అతనిని ఎదుర్కొని హృదయపూర్వకముగా దేవుని వాగ్దానమును బట్టి అతనిని ఆశీర్వదించాడు (ఆది 14:20) అప్పుడు అబ్రాము తనకు కలిగిన వాటన్నిటిలో పదియవ వంతు యాజకునికి ఇవ్వటం జరిగింది.

పదియవ వంతు తమది కాదు దేవునిది అనే విషయము చాలా మందికి తెలియదు. దేవునికి చెందవలసిన పదియవ వంతుని దానధర్మములు చేసేవారు ఉన్నారు. అలాగే పదియవ వంతు మేము ఇవ్వనక్కరలేదు అని, సేవకే ఖర్చు పెడుతున్నామని సమర్ధించుకునే సేవకులు ఉన్నారు, కానీ అబ్రాము అలా చేయలేదు. తనకు రొట్టెను, ద్రాక్షారసమును తెచ్చి ఇచ్చిన యాజకునికి పదియవ వంతు ఇవ్వటం జరిగింది. దశమ భాగం విషయంలో కుంటి సాకులు చెప్పకుండా మనం వెళ్లే దేవుని మందిరములలో దేవునికి చెల్లించేవారమై ఉండాలి. సేవకులైతే తమపైన నాయకులకు లేదా తమకంటే ఎక్కువగా దేవుని చేత వాడబడుచున్న దైవసేవకులకు ఇవ్వాలి. దేవునివి దేవునికి ఇవ్వనివాడు దేవుని సొమ్మును దొంగిలించు చున్నాడని వాక్యము చెబుతుంది. వారు దేవునిని ప్రేమిస్తున్నామని చెప్పడంలో అర్థం లేదు.

**6. ఆతిథ్యము ఇచ్చే మనసు :-**

అబ్రాహాము ఎండవేళ గుడార ద్వారము దగ్గర కూర్చుని ఉన్నప్పుడు, ముగ్గురు మనుష్యులు అతని యెదుట నిలువబడిరి. వారిని ఎదుర్కొనుటకు పరుగెత్తి, నేల మట్టుకు వంగి, (ఆది 18:2,3). ఆతిథ్యము ఇచ్చుటలో ఎంతో ఆత్రుత, ఆసక్తి అబ్రాహాములో కనబడుతున్నాయి. ఆ ఆతిథ్యమును స్వీకరించి, ముగ్గురు మనుష్యులు అబ్రాహామును ఆశీర్వదించి వెళ్ళారు.



ఆతిథ్యము ఇచ్చే అవకాశము రావడం గొప్ప ధన్యత. ఆతిథ్యం తీసుకోవటం గొప్ప విషయము కాదు కాని ఇవ్వడం అనేది విలువైనది. ఆతిథ్యం అనేది ఈ దినములలో ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉన్నది. అబ్రాహాము ఇచ్చిన ఆతిథ్యం ప్రతిఫలం ఆశించనిది. ఇట్టి మనస్సు ఆశీర్వాదమును కలిగిస్తుంది.



**7. కుమారుని ఇచ్చుట:-**


అనేక సంవత్సరముల నిరీక్షణ తరువాత పుట్టిన వాగ్దాన పుత్రుడు. "నీకు ఒక్కడైయున్న నీ కుమారుని, అనగా నీవు ప్రేమించు ఇస్సాకుని తీసుకొని, దహన బలిగా అతని నర్పించుమని చెప్పెను .( ఆది 22:2)

దేవుడు మనుష్యులను దహన బలిగా అడగటం చరిత్రలో అంతకు ముందు ఎప్పుడూ జరుగలేదు. అయినప్పటికీ అబ్రాహాము సందేహింపక తన పనివారిలో ఇద్దరిని వెంటబెట్టుకొని ఇస్సాకుతో కలిసి ఆ చోటికి వెళ్లెను. మార్గమధ్యంలో ఆ చిన్నవాడు అమాయకంగా నా తండ్రీ ! కట్టెలును, నిప్పును ఉన్నాయి కాని దహన బలికి గొర్రె పిల్ల ఏది అని అడిగెను. కుమారుడా! దేవుడే చూచు కొనును అని చెప్పి సముదాయించెను.

దేవుడు చెప్పిన చోటికి వచ్చి, బలిపీఠము కట్టి, బలిపీఠము మీద కట్టెలు పేర్చి, తన కుమారుడైన ఇస్సాకును బంధించి కట్టెలపై ఉంచెను. ఇస్సాకును వధించుటకు చేయి చాపి కత్తి పట్టుకొనగా యెహోవా దూత పరలోకము నుండి అబ్రాహామా, అబ్రాహామా ఆ చిన్న వాని మీద చేయి వేయకుము. ఒక్కడే అయ్యున్న నీ కుమారుని ఇచ్చుటకు వెనుతీయలేదు కనుక నీవు దేవునికి భయపడే వాడవని నాకు కనబడుచున్నదని చెప్పెను. నీవు నా మాట వినినందున, భూలోక నివాసులందరు నీ సంతానము వలన ఆశీర్వదించబడుదురని చెప్పెను.

ప్రియచదువరీ! అబ్రహాము యొక్క జీవితంలో పైన పరిశీలించిన 7 లక్షణములు సామాన్యమైన వ్యక్తిని ఆశీర్వాదానికి కేంద్ర బిందువుగా మార్చటం జరిగింది. కాబట్టి మనము ఆశీర్వదించబడటం మాత్రమే కాకుండా మన ద్వారా అనేకులను ఆశీర్వదించే దేవుడు మన ప్రభువైన యేసుక్రీస్తు. మనం కూడా జీవితంలో అబ్రహాము గుణలక్షణములు కలిగి ముందుకు కొనసాగుదాం.

దేవుడు మిమ్ములను ఆశీర్వదించును గాక !



# జొనాథన్ ఎడ్వర్డ్స్

ఒక ప్రముఖ ఉజ్జీవమునకు ఉదాహరణ ఒక గొప్ప దైవజనుని ద్వారా అమెరికా దేశంలో వచ్చిన గొప్ప పరివర్తన. ఇది జొనాథన్ ఎడ్వర్డ్ అనే ఒక గొప్ప దైవజనుని పరిచర్యలో మొదలైన గొప్ప మేల్కొలుపు వలన జరిగింది.

1734వ సంవత్సరములో నార్తంప్టన్‌లోని మసచూసెట్స్ పట్టణంలో ఈ దైవసేవకుడు తన మోకాలు మీద మోకరించి తప్పిపోయిన 1100 ఆత్మలను రక్షించాలని దేవునికి మొరపెట్టాడు. దేవునికి భయపడే గత తరం కాలం గతించిపోయింది. క్రొత్త తరం దేవునిని మరిచిపోయింది. జారత్వం, మోసం, స్వయం ఆసక్తి అనేవి పాలించాయి. కొందరు రాబోయే లోకమును గురించి పట్టించుకున్నారు. కనికరం గల దేవుని ప్రేమను గురించి ఎవరూ పట్టించుకోలేదు. చర్చి గోడలు శిథిలమైపోతున్నాయి. అనేక మంది క్రైస్తవులు పాపములో జీవిస్తున్నారు. అనేక సంవత్సరముల నుండి ప్రభువు స్వరాన్ని వినడం లేదు. అప్పుడు ఎడ్వర్డ్ తన స్వంత పట్టణములోని ఆత్మల కోసం గంటల తరబడి మొరపెట్టి ప్రార్థనలో తీక్షణంగా వేచియున్నాడు. అప్పుడు ఒక గొప్ప అద్భుతం జరిగింది. ఎడ్వర్డ్స్ గతములో ఎన్నడూ ప్రసంగించనట్లు ప్రసంగించడం మొదలుపెట్టాడు. ప్రభువు కనికరం అతని హృదయమును నింపగా, మారుమనస్సు పొందమని ఎడ్వర్డ్స్ అనేక మంది ప్రజలను ఆహ్వానించాడు.

క్రైస్తవులు మారుమనస్సు పొందడం మొదలుపెట్టారు. కాలనీలలో, గృహాలలో ప్రార్థన మొదలైంది. దుకాణములు మూయబడ్డాయి. వ్యాపారములు మూతపడ్డాయి. వారు ప్రార్థన కోసం కూడుకున్నారు. మారుమనస్సు వలన కొందరి కళ్ళ నుండి కన్నీళ్ళు కారుతున్నాయి. మరి కొందరు సంతోషం, ప్రేమతో పరవశించారు. ఇతరులు పొరుగువారి ఆత్మలను పట్టించుకున్నారు. అనతికాలములోనే ఉజ్జీవం వారి పట్టణమంతా ప్రాకింది అని రచయిత వ్రాశారు. మైనె నుండి జార్జియా వరకు ఉజ్జీవం వ్యాపించింది. ఆత్మీయ ఆసక్తితో కాలనీలను ఐక్యపరచడంలో ఉజ్జీవం ప్రముఖ పాత్రను పోషిస్తుంది. కాలనీల మధ్య నూతన ఐక్యత, బలమునకు ఇది పునాది వేసింది. ఫలితముగా 1776లో ఒక క్రొత్త దేశం ఆవిర్భానికి దారి తీసింది.

అంతగా అభిషేకం, ఒప్పుదల ఎక్కడ నుండి వచ్చింది? ఆ గొప్ప గమ్యాన్ని చేరడానికి ఎడ్వర్డ్స్‌ను ప్రత్యేకించినదేమిటి? ఎక్కడ గొప్పతనం విత్తనాలు ఉత్పత్తి అయ్యాయి?

అలాంటి పరిపూర్ణ సమాజ పునరుద్ధరణను తెచ్చిన పరిస్థితులు ఏమిటి? ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాలంటే మనం ఎడ్వర్డ్స్ అంతర్గత జీవితమును చూడవలసి ఉంటుంది. యేసుక్రీస్తులో దాగియున్న అతని ప్రార్థనా జీవితమును చూడాలి. యౌవ్వన ప్రాయము నుండి ఎడ్వర్డ్స్ దేవుని సన్నిధి కోసం ఎక్కువ సేపు రహస్యముగా ప్రార్థనలో గడిపేవాడు. అతడు తరచు పంట పొలాల్లో లేక కొండ మీద ఒంటరిగా నడుస్తూ దేవునితో తీక్షణమైన భారముతో ప్రార్థించేవాడు. దేవుని తియ్యదనం, వెలుగును గురించి లోతైన అవగాహనను కలిగియుండేంత వరకు అతడు పరమ గీతములు పుస్తకమును చదవడానికి ఎక్కువ సమయం కేటాయించేవాడు. తన జ్ఞానేంద్రియముల మీద మరోలోకం నుండి వచ్చిన ఆకస్మిక వెలుగునే దేవుని సన్నిధిగా అతడు అనుభవించాడు. ఎడ్వర్డ్స్ దేవుని నిజమైన సన్నిధితో అన్యోన్యంగా ఉండాలని వెదికాడు గనుక అతడు గొప్పగా వాడబడ్డాడు. వ్యక్తులను కలిపిన ప్రార్థన కంటే సామూహిక ప్రార్థన ఎంతో ప్రభావవంతమని అతడు నమ్మాడు.

తన ప్రజలు ప్రార్థనకు సమర్పించుకుంటే దేవుడు ఏమి చేయగలడో మీరు చూశారా? ఒకవేళ మనం మోకరించి పరిశుద్ధాత్మ కదలిక కోసం బలంగా మొరపెడితే మనం చదివి, వినినదాని కంటే ఎక్కువ చేయడానికి దేవుడు సమర్థుడని మీరు భావిస్తున్నారా? మీ ప్రాంతములలో ఉజ్జీవమునకు తగిన మూల్యమును చెల్లించడానికి మీరు సిద్ధంగా ఉన్నారా?


## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు**
**కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**



# “ దేవుడు చూచెను”

- సిస్టర్ వి. విజయ

**లేయా ద్వేషింపబడుట**
**యెహోవా చూచి**
**ఆమె గర్భము తెరిచెను.**
**– ఆదికాండము 29:31**

యాకోబు తన తండ్రి వద్ద నుండి జ్యేష్ఠత్వపు ఆశీర్వాదమును పొందుకొని, ఆ ఆశీర్వాదము పోగొట్టుకున్న అన్న చంపుతాడేమోనని భయపడి, తల్లి యొక్క సలహా మీద మేనమామ అయిన లాబాను వద్దకు పారిపోయి వచ్చాడు. లాబానుకి ఇద్దరు కుమార్తెలు పెద్ద కుమార్తె – లేయా – జబ్బు కండ్లు గలది. చిన్న కుమార్తె –రాహేలు – రూపవతియు, సుందరియునై యుండెను. (ఆదికాండము 29:17) యాకోబు రాహేలుని చూచి ఇష్టపడి, ఆమెను వివాహము చేసుకోవాలని ఆశపడి, 7 సంవత్సరములు లాబానునకు కొలువు చేసెను. అయితే దినములు సంపూర్ణమైనపుడు లేయాని అతనికి ఇచ్చి వివాహము చేసెను.

**లేయా జీవితమును మనము పరిశీలించినపుడు:–**

**1. మనుష్యుల చేత ద్వేషింపబడింది:–** లేయా జీవితములో బాహ్యరూపమును బట్టి తండ్రియైన లాబానుకు ఆమె భారముగా అనిపించింది. యాకోబు మనసులో రాహేలు ఉన్నదని, ఆమె కోసమే అతను కొలువు చేస్తున్నాడని తెలిసి, లేయా మనసును గ్రహించకుండా యాకోబుకు ఇచ్చి వివాహము చేశాడు. వివాహము అయిన తరువాత లేయా యాకోబు చేత ద్వేషింపబడింది.

**2. కోపము, అసూయ లేని స్థితి:–** (ఆదికాండం 29:30) యాకోబు రాహేలుని ప్రేమించి, మరల 7 సంవత్సరములు లాబానుకు కొలువు చేసి, ఆమెను వివాహము చేసుకొనెను. చెల్లి అయిన రాహేలు, భర్త అయిన యాకోబు చేత ప్రేమించబడుట చూచిననూ, లేయా ఎంత మాత్రమూ కోపమును తెచ్చుకోలేదు. అదే విధంగా రాహేలు యొక్క సౌందర్యమును బట్టి అసూయని ఎంతమాత్రమూ కలిగిలేదు. తన స్థితిని బట్టి తనని తాను నిందించుకొనలేదు.

**3. యెహోవా ఆమెను చూచెను:–** యాకోబు లేయాను ద్వేషించుట యెహోవా చూచి ఆమె గర్భమును తెరిచెను. మనుష్యులు ఆమెను వదిలివేసి, పట్టించుకొనకుండా ఉన్ననూ యెహోవా ఆమె మనవిని లక్ష్యపెట్టారు. యెహోవా ఆమె పైరూపమును లక్ష్యపెట్టలేదు కానీ ఆమె హృదయమును లక్ష్యపెట్టారు.

**4. దేవుని స్తుతించే మనసును, నిరీక్షణను కలిగి ఉన్నది:-** యెహోవా ఆమెకు కుమారులను అనుగ్రహిస్తున్న ప్రతీ సమయములోనూ, ప్రతీసారి దేవుడు నా మొర విన్నాడు, నా మనవిని ఆలకించాడు, నన్ను కరుణించాడు అనే కృతజ్ఞతా హృదయమును కలిగి, ఆయనను స్తుతించుచూ, ప్రతీసారి నా భర్త నన్ను ప్రేమిస్తాడు, ఈ సారి నన్ను హత్తుకుంటాడు అనే ఆశతోనూ, నిరీక్షణను మాత్రమే కలిగియున్నది.

మన జీవితంలో మనకంటే అందంగా ఉన్నవారిని, అభివృద్ధి చెందుతున్న వారిని, ఆత్మీయంగా మనకంటే ముందుగా వెళ్ళుతున్నవారిని చూచి అసూయ పడకూడదు. మత్సరము ఎముకులకు కుళ్ళు అని సామెతలు 14:30 లో చెప్పబడింది. మన హృదయములో ఎవరిపైనా కోపము కలిగి ఉండకూడదు. నరుని కోపము దేవుని నీతిని నెరవేర్చదు. (యాకోబు 1:20)



లేయా మనుష్యుల ప్రేమను పొందక, ద్వేషించబడిననూ ఆమె మనసు యెహోవాను హత్తుకొని, ఆయన మీద నిరీక్షణ కలిగి ఉండుట చేత, ఇశ్రాయేలు 12 గోత్ర కర్తలైన 12 మంది కుమారులలో 6గురు లేయా గర్భము నుండి పుట్టినవారే. అంత మాత్రమే కాక, యేసుక్రీస్తు శరీరధారియైన శిశువుగా యూదా అను గోత్రము ద్వారా భూమి మీద జన్మించాడు. ఈ యూదా లేయా గర్భమున పుట్టిన కుమారుడే. ఆహా! మనుష్యులు ద్వేషించిన లేయా యొక్క హృదయమును చూచిన దేవుడు ఎంత గొప్ప ధన్యతను ఆమెకు అనుగ్రహించారు. అంతే కాక ఆమె దినములన్నియూ క్షేమముగా ఉంచి నెమ్మదిగా సమాధిలోనికి దిగునట్లుగా దేవుడు చేశారు. లేయా మరణము తరువాత ఆమె పితరులైన అబ్రాహాము, ఇస్సాకుల సమాధి ప్రక్కన సమాధి చేయబడింది.

కావున ప్రియ సహోదరీ! కుటుంబములోని భర్త, బంధువుల చేత ద్వేషించబడుచున్ననూ, మన చుట్టూ ఉన్న పరిస్థితులను బట్టి నిరీక్షణకు ఆధారమే కనిపించకపోయిననూ, ప్రతి స్థితిని బట్టి దేవునిని స్తుతించుచూ, మేలు చేయు దేవునివైపు చూస్తూ ముందుకు కొనసాగుదాం. ఈ విధముగా జీవించిన లేయా జీవితమును ఆశీర్వదించిన దేవుడు నిశ్చయముగా మన జీవితములను ఆశీర్వదించి ఆయన కృపతో నడిపిస్తారు.

దేవుడు మనకు తోడైయుండును గాక!



# అపోహలు

అపోహ అనగా లేని దానిని ఊహించుకొనుట. అపోహ అనునది మన జీవితములలో మనుష్యులతోను, దేవునితోను సమాధానము లేకుండా చేస్తుంది. అపోహలు ఒకరి ఎడల ఒకరికి శత్రుత్వమును కలుగచేస్తాయి.

దేవుడు మనిషిని సృజించినపుడు అపోహ అనేది ఉండేది కాదు. ప్రతి దినము ఆదాము, అవ్వలతో మాట్లాడుతూ ప్రేమ, అనురాగములతో ఉండేవారు. నేడు అనేక కుటుంబములలో భార్య, భర్త మీద, భర్త, భార్య మీద అపోహలను కలిగి ఉండుట వలన నమ్మకత్వము లేక, పరస్పర అవగాహన కోల్పోయి, చూడటానికి కలిసే జీవిస్తున్ననూ, హృదయములలో వ్యతిరేక భావములు కలిగి ఉంటున్నారు. అదే విధంగా తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్‌ను మంచిగా తీర్చి దిద్దాలనే ఆశతో మందలించినప్పుడు, పిల్లలైన వారు నన్ను ప్రేమించట్లేదనే అపోహతో కొన్నిసార్లు బలవంతపు మరణములను కొని తెచ్చుకుంటున్నారు. మరి కొన్ని సార్లు తల్లిదండ్రులకు అవిధేయులుగా జీవిస్తున్నారు. మనము అపోహలతో సమాజమును చూస్తే, మంచి చెడుగా, ప్రేమ స్వార్థముగా, యధార్థత మోసముగా కనపడుతుంది. దీనిని బట్టి దేవుని దృష్టిలో అపరాధులుగా మార్చబడతాము. అదే విధముగా ఆత్మీయ జీవితములో వాక్యమును వింటూ ఉన్నప్పుడూ, చదువుతూ ఉన్నప్పుడు ఇది నిజముగా జరిగిందేనా? మన జీవితములో కూడా జరుగుతుందా? అనే అపోహలు లేకుండా జీవించాలి. అపోహలను సాతాను కలిగిస్తాడని గ్రహించుకోవాలి.

సృష్టిలో మొట్టమొదటి కుటుంబ మైన ఆదాము, అవ్వల జీవితములో దేవుడు చెప్పిన మాటలను గూర్చి సాతాను అవ్వతో ఇది నిజమా ? అనే అపోహను కలిగించి, వారు ఆజ్ఞను అతిక్రమించేలా చేసి, దేవుని దృష్టికి దోషులుగా మారేలా ప్రేరేపించాడు. తద్వారా దేవుని ప్రేమ నుండి వారు దూరపరచబడ్డారు. అపోహ కలిగినప్పుడు అన్నిటినీ అనుమానించి హృదయమును కఠినముగా మార్చుకొనుట జరుగుతుంది. హృదయమును కఠినపరుచు కొనువాడు కీడులో పడును అని సామెతలు 28:14 లో వ్రాయబడింది. కాబట్టి మనము అర్థంలేని అపోహలతో సమయమును తద్వారా జీవితమును వ్యర్థము చేసుకుని సాతాను చేతికి చిక్కక, మంచి ఆలోచనలతో జీవిత విధానమును మార్చుకుంటూ ఉండుట వలన దేవుని చేతిలో సురక్షితముగా జీవించెదము.

**- ఎడిటర్.**

# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**– సీరియల్ 23వ భాగము**



ఆయన ఎక్కువసేపు ఉంటే ప్రజలకి అంత ఇష్టము ఉండేది కాదు. ఒకానొక దినమున పొలములో కోత కోస్తున్న వారి దగ్గరకు వెళ్ళి వారికి సువార్త చెప్పనారంభించాడు. కొంచెంసేపు పట్టీ పట్టకుండానే విని ఆ తరువాత వారాయనను దూషించనారంభించాడు. వేరే మతమును గురించి వినడం తమకి ఇష్టం లేదని చెప్పారు. వారికి చాలా పని ఉన్నది. అంతలో వారిలో ఒకడు ఒక రాయి తీసుకొని సుందర్ ముఖమునకు గురి చూసి విసిరాడు. ఆ దెబ్బకు సుందర్ ముఖం మీద గుంట పడి రక్తం కారనారంభించింది. అయితే ఆ రక్తమును కడుక్కొని ఒక్క మాట కూడ మాట్లాడకుండ అక్కడే నిలబడ్డాడు. కొంత సేపట్లోనే ఆ రాయి విసిరిన వానికి తీవ్రమైన తలనొప్పి రావడంతో అతడు పని మానవలసి వచ్చింది. పని మనుష్యులలో ఒకడు తగ్గినా పనికి ఎంత నష్టమో సుందర్‌కి తెలుసు. అందువలన వెంటనే వెళ్ళి అతని స్థానములో కోత కోయడం ప్రారంభించాడు. వారితో పాటు సాయంత్రం వరకు అతడు అలాగే పని చేయడం చూచినప్పుడు మిగిలిన పనివారికి ఆశ్చర్యం కలగడమే గాక సుందర్‌పై సదభిప్రాయం ఏర్పడింది. వారు మనవి చేయడంతో వారితో కలసి భోజనమునకు గ్రామములోకి వెళ్ళాడు. ఆ తరువాత తన దారిలో తాను వెళ్ళిపోయాడు. ఆ తరువాత ఆనాటి కోత వలన వచ్చిన ధాన్యమును చూచినప్పుడు అంతకుముందు ఎన్నడూ లేనంత పెద్ద మొత్తంలో దిగుబడి రావడం చూచి వారు ఆశ్చర్యపోయారు. ఆ సాధువు తమతో కలిసి కోత కోయడం వలననే ఇలా జరిగిందని గ్రహించడంతో ఆశ్చర్యం కాస్తా భయంగా మారింది. అతడు పరిశుద్ధుడు. అయితే అతని సందేశమును వారు తిరస్కరించారు. ఆయనను వెదకడానికి ప్రయత్నించారు గాని అప్పటికే సుందర్ వెళ్ళిపోయాడు. వారిలో ఒకరు సుందర్ సందేశమును వినాలని కోరి మా దగ్గరకు తిరిగి రమ్మని సుందర్‌ని బ్రతిమాలుచూ ఈ సంఘటన అంతటిని ఉత్తర భారతదేశములో వెలువడే ఒక పత్రికలో ప్రచురించారు.

కొండ ప్రాంతపు విడిది స్థలములలో గాని, పట్టణములలో గాని తాను ఉండిన దినములలో కొందరితో స్నేహం చేశాడు సుందర్. వీరిలో న్యూజిలాండ్‌కు చెందిన రెవ. టి. సి రిడిల్ ఒకరు. ఈయన యౌవనుడు. ఆ తర్వాత కాలములో ఇతడు సుందర్ జీవిత చరిత్ర

వ్రాశాడు. ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కళాశాలకు చెందిన సి.ఎఫ్.ఆండ్రూస్ మరొకరు. 1907లో మొట్టమొదటి సారిగా సుందర్‌ని కలిసికొన్నప్పుడు యౌవనకాలములో ఉండే సహజమైన బిడియమును అతనిలో చూచాడు. మిగిలిన వారందరూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ఉంటే సుందర్ ఒక మూలన కూర్చుని తన స్వంత ఆలోచనలతో మునిగి తేలుచుండేవాడు. ఎవరైనా ఏదైనా అడిగితే మెరిసే కళ్ళతో తెలివిగా చక్కగా ప్రత్యుత్తర మిచ్చేవాడు. అప్పటి వరకు మౌనంగా ఉన్న సుందర్ అలా జవాబు చెప్తున్నప్పుడు అందరూ శ్రద్ధగా వినేవారు. ఆండ్రూస్ గారు ఆంగ్లేయుడైనప్పటికిని గోప్యంగా ఉండే సుందర్ స్వభావమునకు ఆకర్షితుడైనందు వలన మిగిలిన ఆంగ్లేయుల కంటే సుందర్‌ని బాగా అర్థం చేసికొన్నాడు. అమెరికా దేశమునకు చెందిన ప్రెస్బిటేరియన్ మిషనెరీ డా.ఇ.ఎమ్ వెర్రీ, సుందర్‌ను యౌవనకాలం నుండి ఎరిగినవాడై అతని భావ జీవితముపై ఎంతో శ్రద్ధ చూపాడు. లూధియానా నుండి వెలువడే హిందుస్థానీ క్రైస్తవ వార పత్రికకు డా.వెర్రీ ఎడిటర్‌గా పని చేశారు. తన పత్రికలో ప్రచురించేందుకుగాను మీ కార్యకలాపముల సమాచారమును మా పత్రికకు వ్రాయండి అని సుందర్‌ని ఆహ్వానించి ఆ సమాచారమును పత్రికా మూలంగా ప్రజలకు తెలియజేసిన వారిలో వెర్రీ గారే మొదటి వ్యక్తి. హిమాలయ పర్వతముల కావలనున్న ప్రజలకు సువార్త నందించడానికి ఇప్పటికే ఎంతో భారమును కలిగియున్న సుందర్‌కు ఇతరులను కూడా ఈ దిశగా కార్యోన్ముఖులను చేయడానికి దీనిని ఒక అవకాశంగా భావించి వెర్రీగారి మాటకు సమ్మతించాడు సుందర్. అయితే తన ప్రయాణములను గూర్చియ. టిబెట్ సరిహద్దులలో తాను కలుసుకున్న ప్రజలను గూర్చియు మాత్రమే సమాచారం వ్రాసినప్పటికిని అంతకు ముందు సుందర్‌ను గూర్చి ఎన్నడూ వినని వారికి కూడా ఆయనను గూర్చి తెలిసింది. ఆయనను చూడాలని, ఆయన ప్రసంగాలు వినాలనీ ప్రజలు ఎంతో ఆసక్తి చూపనారంభించారు. అయితే సుందర్ ఊహించిన దాని కంటే విస్తారమైన సేవను దేవుడు అతని కొరకు సిద్ధం చేస్తూ ఉన్నారు.

– సేకరించబడినది. –(ఇంకా వుంది)



# నిజం - నిప్పు

Hai పిల్లలూ! చాలా busy గా ఉన్నట్లున్నారు! Schools start అయ్యాయనా? ఏంటి సంగతులు, Schoolకి intrest గా వెళ్తున్నారా? వర్షాకాలం schoolకి డుమ్మా కొట్టాలంటే మంచి chance. కొందరేమో వర్షానికి తిట్టుకుంటూ వెళ్తూ ఉంటారు. పిల్లలూ! ఈ వర్షా కాలంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. మీరు ఆరోగ్యంగా ఉండి బాగా చదువుకోవాలంటూ పెద్దలు చెప్పిన జాగ్రత్తలు పాటించాలి. బాల్యం నుండే మంచి విద్యా బుద్ధులు కలిగి సమాజానికి ఉపయోగకరంగా ఉండాలని సూచిస్తున్నాను. మీరు నిజాయితీగా మీ స్కూల్లో ఉంటే పెద్దయ్యాక సమాజానికి ఎంతో ప్రయోజకులుగా ఉంటారు. ప్రస్తుతం సమాజంలో నిజాయితీగా లేకపోవటం వలన ఎన్ని సమస్యలో media చూపిస్తూనే ఉంది. మీకొక story చెబుతాను చూడండి.

అనగనగా ఒక రాజు, ఆ రాజు దగ్గర అనేక మంది పనివాళ్ళు, సలహా దారులు ఉండేవారు. బీర్బల్ అనే సలహాదారుడు రాజుకి చాలా ఇష్టం. ఎందుకంటే అతని సలహాలు చాలా నిజాయితీగా, సమయోచితంగా ఉండేవి. రాజు, బీర్బల్ సలహాలు పాటిస్తూ అతన్ని ఇష్టపడటం మిగతావారికి ఇష్టం ఉండదు. మంత్రి, సలహాదారులు, సేవకులు అందరూ బీర్బల్ మీద అసూయపడతారు. అతని మీద రాజుకి కోపం తెప్పించి శిక్షపడేలా చెయ్యాలని వారందరు plan వేస్తూంటే మస్తాన్ అనేవాడు మంచి ఉపాయం చెబుతాడు. అందరూ కలసి ఏవో గుసగుసలు చెప్పుకొని. "ఈ విధంగా చేద్దాం, దాంతో అవమానం భరించలేక రాజుని వదిలి పారిపోతాడు" అని మస్తాన్ plan చెబుతాడు.

మరునాడు అందరూ రాజు ఎదుట సభలో ఉండగా, మస్తాన్ పరుపరుగున వచ్చి .. "రాజా, నేనొక ఘోరమైన నేరాన్ని కళ్ళారా చూశాను" అన్నాడు. "ఏంటో చెప్పు అన్నాడు రాజు" ఆ నేరాన్ని చేసింది మన కొలువులోని ఓ కీలకమైన వ్యక్తి. చెబితే నా భవిష్యత్ ఏమౌతుందోనని భయం అన్నాడు. "ఫర్వాలేదు చెప్పు, దోషులు ఎంతటి వారైన శిక్ష తప్పదు" అన్నాడు రాజు. "నిన్నటి రాత్రి మన ఖజానాలో విలువైన వజ్రం ఓ వ్యక్తి దొంగిలించడం నా కంట పడింది. "ఆ వ్యక్తి.... మన బీర్బల్‌గారే! ". సభలో అందరూ ఆశ్చర్యపోయారు. "అతడే దొంగ అని నువ్వు నిరూపించగలవా?" అడిగారు రాజుగారు.

"చిత్తం ... నిజం నిప్పు లాంటిది అంటారు. నిప్పుల్లో ఎర్రగా కాల్చిన ఓ ఇనుప కడ్డీని బీర్బల్ చేతిలో పెడతాను. చేతులు కాలకుండా ఉంటే ఆయన నిర్దోషి" అన్నాడు మస్తాన్. "నువ్వేమంటావు బీర్బల్" అన్నాడు రాజు. "నేరారోపణ జరిగింది కాబట్టి మస్తాన్ చెప్పినట్టే కానివ్వండి రాజా" అన్నాడు బీర్బల్. భటులు వెళ్ళి నిప్పుల్లో ఎర్రగా కాల్చిన ఇనుప కడ్డీని పళ్లెంలో పెట్టి తెచ్చారు. బీర్బల్ ఆ కడ్డీని చేతుల్లోకి తీసుకోబోతు ఆగాడు. "మస్తాన్‌గారూ ... మీరే ఆ కడ్డీని నా చేతిలో పెట్టండి" అన్నాడు బీర్బల్. "అమ్మో ... నిప్పుని ముట్టుకోవాలా" అంటూ అరిచాడు మస్తాన్. " ఆ నిప్పుని పట్టుకుంటే దోషుల చేతులు మాత్రమే కాలుతాయి కదా! నీకెందుకు భయం?" అన్నాడు బీర్బల్. రాజుగారు కూడా బీర్బల్‌నే బలపరిచారు. దాంతో మస్తాన్ భయపడిపోయాడు. తన అసూయ తనకే చేటు తెచ్చిందంటూ బీర్బల్ కాళ్ళపైబడి క్షమాపణ కోరాడు.

చూశారా పిల్లలూ! బీర్బల్ నిజాయితీ, నమ్మకత్వం, కష్టపడే మనస్థత్వం కలిగి రాజుగారి దగ్గర సంపాదించుకున్న స్థానాన్ని చూసి అసూయపడి అందరూ కలసి అతనిని రాజుగారికి దూరం చేయాలని పన్నిన కుట్ర ఎలా విచ్ఛిన్నమైందో చూశారా! నిజాయితీ, నమ్మకత్వంతో సంపాదించుకున్న స్థానాన్ని ఎవ్వరూ పాడుచేయలేరు. ఎవరైనా పాడుచేసినట్లు కనిపించినా అది తాత్కాలికమే. నమ్మకత్వంతో జీవించేవారికి వెలకట్టలేము. అలాంటి వారిని చూచి మనం కూడా అలా జీవించటానికి పురికొల్పబడవలెనే కాని శత్రుత్వం కలిగి ఉండకూడదు. మీరు కూడా ఈ చిన్న వయసులోనే మీ హృదయాలలో అసూయ, ద్వేషం అనే వాటికి స్థానం ఇవ్వకుండా జీవించాలని కోరుకుంటున్నాను. ఇలాంటి జీవిత విధానం మీ భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అట్టి ధన్యతను దేవుడు మీకు దయచేయాలని ఆకాంక్షిస్తూ ప్రేమతో .......

**- మీ అక్కయ్య**


రండి! పాల్గొనండి!! ఆశీర్వాదం పొందండి !!!

**2012 ఆగష్టు 15వ తేది ఉపవాస ప్రార్థన**

**దేశ క్షేమం, క్రైస్తవ సంఘాల ఉజ్జీవం,**

**కుటుంబముల ఆశీర్వాదము కొరకు దేవునిని వేడుకుందాం.**

**సమయం:** ఉదయం గం. 9.00 లకు

వివరములకు: బ్రదర్. రవీందర్, సెల్: 99631 17628

# "నా జీవితములో దేవుని మేలులు"

- పాల్‌రాజ్, కృష్ణాజిల్లా

నా పేరు పాల్‌రాజ్. మాది కృష్ణాజిల్లా కపిలేశ్వరపురం అనే గ్రామం. నాకు ఇద్దరు చెల్లెళ్ళు, ఒక తమ్ముడు. మా తల్లిదండ్రులు వ్యవసాయపు పనులు చేసుకుంటూ నన్ను డిప్లొమా వరకు చదివించారు. నాకు చిన్నప్పటి నుండి కోపం చాలా ఎక్కువగా ఉండేది. నా చెల్లెళ్ళు, తమ్ముడు నాతో మాట్లాడటానికి కూడా భయపడేవారు. డిప్లొమా పూర్తి అయిన తరువాత నేను ఉద్యోగం కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాను, ఎంతో మందిని కలిసాను కాని ఉద్యోగం రాలేదు. దాని వలన నేను ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఎవరైనా పలకరించినా కోపంగా ప్రవర్తిస్తూ ఉండేవాడిని.

నా ప్రవర్తన అంతా గమనించిన ఒక ఆమె మా అమ్మతో మీ అబ్బాయికి ఎవరో చేతబడి చేయించారు అని చెప్పింది. నా ప్రవర్తనతో విసుగుచెందిన మా అమ్మ, ఆమె చెప్పిన మాటలు నిజమే అనుకొని నమ్మి ఒక రోజున నా దగ్గరకు వచ్చి చేతులు పట్టుకొని నిన్ను చూస్తూ ఉంటే, ఇలా ఒంటరిగా ఆలోచించి ఆలోచించి ఏదో ఒకరోజు ఆత్మహత్య చేసుకుంటావేమోనని భయంగా ఉంది అని ఏడ్చింది. దానితో నా ప్రవర్తన వలన నాకు, నా తల్లిదండ్రులకు సంతోషం లేదు అని చాలా బాధపడ్డాను. అలా ఉంటున్నప్పుడు ఒక ఆదివారం నా క్లాస్‌మేట్ ప్రార్థనకు రమ్మంటే వెళ్ళాను. అక్కడ ఉన్న పాస్టరు గారు నా గురించి అడిగి తెలుసుకొని, నాకు ధైర్యం చెప్పి, ప్రార్థన చేశారు. అంత మాత్రమే కాకుండా నేను ఉద్యోగం లేక నిరుత్సాహ పడుతున్నానని గమనించి ఎపఫ్రా అన్న గురించి చెప్పి హైదరాబాద్ వెళ్ళమని సలహా ఇచ్చారు. నా చదువుకు సంబంధించిన వ్యక్తి కనుక నాకు తప్పకుండా సహాయం చేస్తారు అనుకొని హైదరాబాద్ వచ్చాను. హైదరాబాద్‌లోని చింతల్‌లో అన్నని కలవడానికి ఒక ఆదివారం చర్చికి వచ్చాను. ఆ రోజు ఎపఫ్రా అన్న వాక్యం చెప్తూ దేవుని ప్రేమను గురించి ఆయన మంచితనము గురించి, మనుష్యులను ఆయన ఎంతగా ప్రేమిస్తున్నాడో అనే విషయాల గూర్చి చెప్తూ ఉంటే నాకు అన్నని ఉద్యోగం గురించి అడగాలనిపించలేదు గాని, యేసుప్రభువు గురించి, ఆయన ప్రేమ గురించి ఇంకా తెలుసుకోవాలని, ఆయన సహవాసాన్ని నేను కూడా అనుభవించాలని ఆశ కలిగింది.

అలా ప్రతి ఆదివారపు ఆరాధనలకు, ప్రతినెల జరిగే ఉపవాస ప్రార్థనలకు వెళ్తూ ఉన్నప్పుడు అక్కడ తోటి సహోదరులు మనుష్యుల పట్ల కలిగియున్న బాధ్యతను, కనపరుస్తున్న శ్రద్ధను, పంచుతున్న ప్రేమను చూచినప్పుడు ఆశ్చర్యం కలిగింది. జీవితమునకు నిజమైన అర్థం ఇదే అనిపించింది. వారివలె నేను కూడా జీవించాలనే ఆశ

కలిగింది. అప్పుడు నా ఊహ తెలసినప్పటి నుండి నేను చేసిన పాపములన్నిటిని దేవుని యెదుట ఒప్పుకుని, క్షమించమని పశ్చాత్తాపపడుచూ కన్నీరు విడవటం జరిగింది. దేవుడు నా పాపములన్నిటిని క్షమించాడు అనే నిశ్చయతని నాకు అనుగ్రహించారు. అప్పుడు హృదయంలో గొప్ప సమాధాన సంతోషములను నేను అనుభవించాను. తదనంతరం దేవుని నీతిని నెరవేర్చాలనే ఉద్ధేశ్యంతో బాప్తిస్మం తీసుకుని దేవుని రాజ్య వారసత్వమును పొందాను. ఎప్పుడైతే నేను దేవుని పట్ల ఆసక్తితో ముందుకు వెళ్తున్నానో ఊహించని విధంగా నాకు ఒక మంచి జాబ్ రావడం జరిగింది. నాలో ఉన్న కోపాన్నంతా విడిచిపెట్టి తల్లిదండ్రులతో, చెల్లెళ్ళు తమ్ముడుతో ప్రేమగా మాట్లాడటం, సంతోషంగా జీవించడం దేవుడు నాకు నేర్పించాడు. నాలో ఊహించలేని ఈ మార్పును గమనించి మా అమ్మ తాను పూజలు చేస్తున్న విగ్రహాలన్నింటిని విడిచిపెట్టి యేసుప్రభుని నమ్ముకోవడం, స్వంత రక్షకుడిగా అంగీకరించడం జరిగింది. అంతే కాకుండా మా తమ్ముడు యవ్వనకాలంలో త్రాగుబోతుగా జీవిస్తూ, తల్లిదండ్రులను ఎదిరిస్తూ ఉన్నప్పుడు తమ్ముడిని కూడా హైదరాబాద్ తీసుకురావడం జరిగింది. తను కూడా ఆదివారపు ఆరాధనలో దేవుని వలన మార్పు చెంది త్రాగుడు మాని బాప్తిస్మం తీసుకొని దేవునిలో నమ్మకంగా జీవిస్తూ ఉన్నాడు. నా జీవితంలో దేవుని ఉద్ధేశానుసారంగా దైవసేవకులు నిర్ణయించిన అమ్మాయిని వివాహం చేసుకోవటం జరిగింది. వివాహ జీవితమును దేవుడు ఆశీర్వాదకరంగా నడిపిస్తున్నారు. ఇప్పటి వరకు నన్ను, నా భార్యను, నా కుమారుడిని సురక్షితంగా కాపాడినందుకు ఎంత స్తుతించినను నేను ఋణస్తుడనే.

పరిచర్యలో దైవజనులు, కొంతమంది సహోదరులు దేవుని పనిని నిస్వార్థంగా, ఆసక్తితో చేస్తూ ఉండటాన్ని గమనించి నేను కూడా పరిచర్యలో అప్పగించిన పనులు నమ్మకంగా చేస్తూ ఆనందంగా జీవిస్తున్నాను.

దేవునికి మహిమ కలుగును గాక

# మానసిక భావోద్రేకపరమైన స్వస్థతలు

దీర్ఘవ్యాధులు నయం కావడానికి దావీదు చక్కటి నివారణోపాయమును చెప్పాడు

**భావోద్రేకములలో స్వస్థత పొందడం ఎలా?**

**అ) నీ భారమును ప్రభువు మీద వెయ్యి :-**

**"నీ భారమును యెహోవా మీద మోపుము ఆయనే నిన్ను ఆదుకొనును" (కీర్తన 55:22), మీ చింత యావత్తు ఆయన మీద వేయుడి" (1 పేతురు 5:7)** అని ప్రభువు మనలను ప్రోత్సహిస్తున్నాడు.

ప్రతి ఆందోళనా, భయమూ, ప్రతికూల భావమూ అన్నిటిని ప్రభువు మీద వేయడమే మన అంతిమ విధి అని దీని వలన అర్థం అవుతుంది. మన జీవితములను పూర్తిగా ప్రభువుకు అప్పగించాలి. జీవితమును పూర్తిగా ప్రభువు చేతిలో పెట్టినప్పుడు అది ఆయనది అవుతుంది. దాని క్షేమం ఆయన బాధ్యత అవుతుంది. దానిని ఆయన మంచి ఆరోగ్యముతో, బలముతో ఉంచి పోషిస్తాడు. ప్రభువుపై వేయడం ద్వారా మన బరువులను దింపుకోవడానికి మనం ఇష్టపడినప్పుడే ఆయన మనలను కాపాడుతారు. మన భారములను మనమే మోసుకుంటూ ఉంటే దేవుడు కూడా మన ఆరోగ్యమును నిలిపి ఉంచరు.

నీ భారమును ఆయనకు అప్పగించు, దాని ఆందోళన ఏదో ఆయనను పడనియ్యి. ఆయన దానిని తీసుకొని, ఆయనే చూచుకుంటాడు. ప్రభువా, ఈ సమస్య అంతటిని నీకు అప్పగిస్తున్నాను, దీని విషయం నేనేమీ చేయలేను అని మనము ఆయన చేతిలో పెట్టిన ప్రతి సందర్భములోనూ ఆయన అద్భుతంగా ఆ సమస్యను పరిష్కరిస్తారు. అయితే అది మనము కోరుకున్న సమయములో కాకపోవచ్చు. ఆయన సమయం వరకు మనము వేచి ఉండాలి. అప్పుడు తప్పకుండా దేవుడు అనుగ్రహించు శాశ్వత పరిష్కారమును చూడగలము.

**ఆ) దేవుని వాక్యమును ధ్యానించు :-**

దేవుని వాక్యమును రాత్రింబగళ్ళూ ధ్యానించే వ్యక్తికి ఉండే ధన్యత గురించి దావీదు వ్రాశాడు. **"అతడు నీటి కాలువల యోరను నాటబడినదై ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టు వలె ఉండును. అతడు చేయునదంతయు సఫలమగును" (కీర్తన 1:3)** దేవుని వాక్యమును ధ్యానించడములో రోగ చికిత్స ఉంది. దేవుని వాక్యం **"సర్వ శరీరమునకు ఆరోగ్యమిచ్చును"** అని దావీదు కుమారుడైన సొలొమోను గట్టిగా నొక్కి చెప్పాడు (సామెతలు 4:20-22)

**ఇ) నీ ఊహలను బంధించు :-**

మనలోని ప్రతి ఆలోచననూ చెరపట్టి యేసుకు అప్పగించవచ్చు. కొన్నిసార్లు కలవరపరిచే ఆలోచనలు మనలో పుట్టి మనలను పీడిస్తాయి. అవి మన మనసులలో సాతాను కోటల వంటివి. ఈ ఆలోచనలను దేవుని వాక్యమనే ఆత్మఖడ్గంతో ఎదుర్కోవాలి. భయముకు విరుగుడుగా దేవుడు ఇచ్చిన లేఖన భాగములను తీసుకోవాలి. **"దేవుడు మనకు శక్తియు, ప్రేమయు, ఇంద్రియ నిగ్రహమును గల ఆత్మనే ఇచ్చెను గాని పిరికితనము గల ఆత్మను ఇయ్యలేదు"** (2 తిమోతి 1:7) దీనిని ఒకసారి చేసి ఊరుకోక నెమరువేస్తూ ఉండాలి. దేవుడు మనలను శక్తిమంతులుగా, జయశాలులుగా చేసేందుకు ఆయనకు సహకరించాలి. బిగ్గరగా ఆయన మాటలను ఒప్పుకొని , హృదయమును బలపరచుకొనుట ద్వారా సాతాను దుర్గములు కూలిపోతాయి.

**ఈ) దేవునిపై మనస్సు నిలుపుకో : -**

**"నీ ధర్మశాస్త్రమును ప్రేమించువారికి ఎంతో నెమ్మది కలదు. వారు తూలి తొట్రిల్లుటకు కారణమేమియు లేదు" (కీర్తన 119:165)** దేవుని వాక్యముపై నిలకడైన ప్రేమ గలవారికి కలిగే శాంతి స్వస్థపరిచే శాంతి. **"ఎవని మనస్సు నీ మీద ఆనుకొనునో వానిని నీవు పూర్ణశాంతి గలవానిగా కాపాడుదువు" (యెషయా 26:3)**

తన ప్రజల మానసిక, భావోద్రేకపరమైన సమస్యలకూ అలాంటి ప్రతికూల భావములను మనసులో ఉంచుకోవడం వలన కలిగే వివిధ వ్యాధులకూ దూరంగా ఉండాలని దేవుని అభిమతం.


**ఎపఫ్రా మినిస్ట్రీస్ - హైదరాబాద్‌లో జరిగే ఆరాధన స్థలములు:**

1. భాగ్యలత కాలని, **వనస్థలిపురం**
2. హెచ్.యం.టి., **చింతల్**, జీడిమెట్ల
3. **అనాజ్‌పూర్,** రామోజీ ఫిల్మ్ సిటీ దగ్గర
4. **ఇ.సి.ఐ.ల్,** బస్ స్టాప్ ఎదురుగా
5. **ప్రగతినగర్,** బ్లాక్ నెం.63, రాజీవ్ గృహకల్ప

**వివరములకు:**
Ph: 040-24202227 Cell: 9666666249

# ప్రార్థన - ఊపిరి పీల్చుట వంటిదే

శారీరకంగా మనం ఎదుగుటకు ఊపిరి పీల్చుట సహజంగా ఎలా సహాయ పడుతుందో, ఆత్మీయంగా ఎదుగుటకు ప్రార్థనా జీవిత విధానం సహాయపడుతుంది. తర్వాత మనం ఆత్మీయ పరిణితి చెందుచుండగా, మన ప్రార్థనా జీవితాలు అభివృద్ధి పొందుతాయి. మన ప్రార్థనలు అత్యంత ప్రభావవంతమవుతాయి. ప్రార్థనను గురించి ఉత్తమమైన వాటిలో ఒకటి - ఇది అభివృద్ధి చెందునది ఇది ఒక కళ కాదు మనం సంతోషించు సంబంధమైయున్నది. ఇది వికసించుచుండగా, మనం మరింత తరచుగా, మరింత ప్రభావవంతముగా ప్రార్థించుట నేర్చుకుంటాము. పరిశుద్ధాత్ముని మరింత దగ్గరగా అనుసరించుట నేర్చుకుంటాము. దేవునితో లోతుగా సంభాషించుటకు, ఆయన స్వరం మరింత స్పష్టంగా వినుటకు నేర్చుకుంటాము.

మన అంతరంగ పురుషుడు (దేవునితో మనము సంభాషించు సమయములో) మన ప్రార్థనలో ఏదైనా సరిగ్గా లేనప్పుడు అది మనకు తెలియజేస్తాడు. మన ఆత్మలో నుండి ప్రార్థనలు సరిగా లేనప్పుడు లేక ఏదైనా మారవలసి వచ్చినప్పుడు పరిశుద్ధాత్ముడు అది మనకి తెలియచేస్తారు. అనగా కొన్ని సమయములలో మన ప్రార్థనా జీవితములతో మనం సౌకర్యముగా లేనప్పుడు ఆయనతో మనకి ఉన్న సంబంధములో ఎదగడానికి దేవుడు మనకు సహాయకరంగా నేర్పించి మనలను ముందుకు నడిపించడానికి ప్రోత్సాహపరుస్తూ ఉంటారు. మనం ఉన్న స్థితిలోనే మనలను ఆయన ఎల్లప్పుడూ ప్రేమిస్తున్నాడు, అయితే ఆ స్థితిలోనే మనలను విడువడు అనేది నిజమైనది.

మనం సంతోషకరమైన సంతృప్తికరమైన జీవితములు జీవించాలని దేవుడు కోరుకుంటున్నారు. కొన్నిసార్లు దేవుడు కోరుకుంటున్న ఆ స్థితిలో ఉండటానికి ఇష్టపడనప్పుడు మనలో ఆయన యొక్క అసంతృప్తిని, ఏదో ఒక గురిని చేసుకోవాలన్న భావనను కలుగజేస్తారు. మనలను ఆయన క్రొత్త స్థానమునకు తీసుకువెళ్ళాలి అనుకుంటున్నాడు గనుక ఆయనను వెదుకునట్లుగా మనలను ప్రోత్సాహపరుస్తారు.

నూతన విధానములో ప్రార్థించమని లేక ప్రార్థనకు ఎక్కువ సమయము ఇవ్వమని, ఆయన మనలను కోరుతుండవచ్చు. తరుచుగా ఒంటరిగా ప్రార్థించు ఒక వ్యక్తిని క్రమంగా ప్రార్థించుటకు కూడుకొను ఒక గుంపుతో చేరుటకు నడిపిస్తుండవచ్చును. మరొక వ్యక్తిని ప్రార్థనను గురించి ఎక్కువగా నేర్చుకొనమని నడిపిస్తుండవచ్చును.


మనము ఆయనతో సన్నిహితత్వములో అభివృద్ధి పొందాలని, బలంగా ఎదగాలని, లోతుగా వెళ్ళాలని దేవుడు ఎల్లప్పుడూ కోరుకుంటాడు. దేవుడు మనకు ప్రార్థించుట నేర్పిస్తూ, ప్రార్థనా విధానములో మనలను నడిపించుచుండగా, మనము శిక్ష పొందుతున్నట్లుగా

భావించి నిరాశతో ఉండనవసరం లేదు. ఈ విధంగా మనలను దేవుడు నడిపిస్తున్నాడా లేక సాతాను మనలను ఇబ్బంది పెడుతున్నాడా? అన్నది మనము కనుగొనవలసి ఉన్నది. ఎందుకనగా మన ప్రార్థనా జీవితములలో అసౌకర్యము, అసంతృప్తి మరియు శాంతి లేకపోవుట అనునవి సాతాను పని కూడా అయి ఉండవచ్చును. మనం ప్రార్థించుటకు ప్రయత్నించునప్పుడు వాడు మనలను ఆటంకపరచాలని చూస్తాడు.

సాతాను అబద్ధీకుడు, వాడు మన ప్రార్థనలు నిరుపయోగకరమైనవి, విలువలేనివని తలంచునట్లు చేయుట ద్వారా వాడు సంతోషిస్తాడు. మన ప్రార్థనా జీవితములు సరిగ్గా లేవనే స్థాయికి వచ్చినప్పుడు మనము ఏమి జరుగుతుందో దేవుని అడిగి ఆయన జవాబుకై వేచి చూడవలసి యున్నది. ప్రార్థనలో నూతన స్థాయికి ఆయన మనలను పిలుచుచున్నాడో లేక మనము వృద్ధి చేసుకున్న ప్రార్థనా జీవితమును దొంగిలించడానికి సాతాను ప్రయత్నిస్తున్నాడో ఆయన మనకు తెలియజేస్తారు. సాతాను ప్రార్థనను ద్వేషిస్తూ దానిని ఏ స్థాయిలోనైనా ఆటంకపరచుటకు చూస్తాడని ఎల్లప్పుడూ జ్ఞాపకము ఉంచుకోవలసి ఉన్నది. మనం ప్రార్థించుట ఆయనకు ఇష్టమే కాబట్టి దానిలో మనం సంతోషించాలని కోరుకుంటాడు. మనం ఉన్న స్థితిలోనే మనలను అంగీకరిస్తాడు గానీ తీర్పు తీర్చడు. మన హృదయములలో నుండి వచ్చిన జాలికరమైన అతి చిన్న ప్రార్థనను కూడా విని జవాబిస్తాడు. ఆయన ఎల్లప్పుడూ నిజాయితీని, విశ్వాసమును గౌరవిస్తారు. అదే సమయములో అపరిణితి ప్రదేశాలలోనూ మనలను నిలువనీయడు. అయితే విశ్వాసములోను, శక్తిలోను మరియు ప్రభావములోను ఉన్నత స్థాయిలో ముందుకు వెళ్ళవలసిందిగా మనలను పిలుస్తారు.

(ఇంకా ఉంది)

సేకరించబడింది.



# నదులు



**అహవా నది**

బబులోను దేశములోని యుఫ్రాతు నదికి సంబంధించిన నదీ ప్రాంతము. బబులోనుకు ఉత్తరముగా ఉన్నట్లు కనబడును. చెరపట్టబడిన యూదులను బబులోను నుండి యెరూషలేమునకు తోడుకొని పోవుచున్న మార్గమధ్యములో ఈ నది దగ్గరే ఎజ్రా వారందర్నీ సమకూర్చి అహవా నది దగ్గర ఉపవాసముండుడని ప్రకటించుకొని శుభప్రయాణము కలుగవలెనని దేవుని వేడుకొనగా దేవుడు ఆ సంగతిని బట్టి వారి మనవిని అంగీకరించెను.

**అబానా మరియు ఫర్పరు నదులు :**

**అబానా : రాళ్ళు గల అని అర్థము**

దమస్కులోని రెండు నదులలో ముఖ్యమైనది అబానా నది పేరు. ప్రస్తుతము దానికి బారద అను పేరు కలదు. ఇది దమస్కునకు వాయువ్యముగా 23 మైళ్ళ దూరములో లెబానోను పర్వతములలో పుట్టి దమస్కునకు ఉత్తరముగా ప్రవహించి దానికి తూర్పున 18 మైళ్ళలో ఉండు ఒక సరస్సులో పడును. ఆ నీరు చాల లోతుగాను చల్లగా ఉండి దమస్కు చుట్టూ ఉన్న తోటలలోకి కాలువల ద్వారా ప్రవహించుట వలన దమస్కు చుట్టపట్ల ఉండు ప్రాంతములను మిగుల ఫలవంతమైనవిగా చేయుచున్నది.

**ఫర్పరు :– వేగము**

దమస్కు దగ్గర ఉండు నదులలో ఒకటి. ఇది అబానా నది 7 కాలువలలో ఒక పాయ అను వాడుక మాట దమస్కు ప్రాంతములలో నేటి వరకు కలదుగాని, హెర్మోను పర్వతమునకు తూర్పున పుట్టి దమస్కుకు దక్షిణముగా 10 మైళ్ళ దూరములో ప్రవహించు ఆవాజు నదే ఫర్పరు అనే అభిప్రాయము కూడా కలదు. ఇది కూడా అబానా నదివలెనే ఎడారి ప్రక్కన ఉండు సరస్సులో పడును.

అబానా మరియు ఫర్పరు నదులు యోర్దాను నదుల కంటే మంచి నదులు అని నయమాను తన స్వస్థత విషయములో ప్రస్తావించడం జరిగింది.




# బైబిల్ క్విజ్ -23

(హెబ్రీ పత్రికలో నుండి ఇవ్వబడినవి)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

1. మరణించిన తరువాత కూడా విశ్వాస విషయంలో ప్రశంసించబడినది ఎవరు?
2. కొల్లగొట్టిన సొమ్ములో పదవ భాగాన్ని మొదటగా ఇచ్చినదెవరు?
3. ఎవరి క్రమం ప్రకారం యేసు నిరంతరం ప్రధాన యాజకుడైనాడు?
4. తల్లి, తండ్రి మరియు వంశావళి లేని రాజు పేరు ఏమిటి?
5. హేబెలు రక్తం కంటే మరి శ్రేష్ఠంగా ఎవరి ప్రోక్షణ రక్తం మాట్లాడుతుంది?
6. మోషే పుట్టినప్పుడు రాజాజ్ఞకు భయపడి ఎన్ని నెలలు దాచిపెట్టారు?
7. రాబోవుచున్న మేలుల విషయమై ప్రధాన యాజకునిగా వచ్చినదెవరు?
8. మన ప్రభువు ఏ గోత్రం నుండి వచ్చాడు?
9. తన కుటుంబ రక్షణ కోసం ఓడ నిర్మించిందెవరు?
10. షాలేము అనగా అర్థం ఏమిటి?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు ఆగష్టు 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు సెప్టెంబరు 2012 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా - ఎడిటర్ - స్పర్శ, ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070**

**బైబిల్ క్విజ్ - 22 జవాబులు**

1. నికొపొలిలో (తీతు 3:12)
2. క్రేతీయులు (తీతు 1:12,13)
3. ఒనేసిము (ఫిలోమోను 1:10)
4. పౌలు తీతుతో (తీతు 2:7,8)
5. పౌలు (ఫిలేమోను 1:1)
6. ఒనేసిము (ఫిలేమోను 1:11)
7. ఎపఫ్రా (ఫిలేమోను 1:23)
8. జేనా (తీతు 3:13)
9. ఫిలేమోను (ఫిలేమోను 1:20)
10. తీతు (తీతు 1:5)

**బైబిల్ క్విజ్ - 22 ప్రశ్నలకు జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

కొర్నేలీ, రాణి, పూజిత, విజయ, వాణి, హనోకు, కృప, సుధారాణి, రాజ్‌కుమార్, సరస్వతి

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## జూలై - ఆగస్టు

**భాగ్యలత** : శారమ్మ, నిఖిల్ (మిర్యాలగూడ), రమేష్‌బాబు, సాత్విక్, గంగాధర్, సురేష్, రూఫస్, ప్రశాంత్ వర్మ, బుజ్జి, రాజేష్, ఎస్తేరు, రత్నం, దివ్య, రమ్య(మిర్యాలగూడ), ప్రభాకర్, ప్రసాద్, ప్రకాష్, దివ్యవాణి, తరుణి, విజయలక్ష్మి, నాంచారమ్మ, పాపారాణి, రాజేశ్వర్రావు, వాణి, జ్యోతి, వీణ, శిరీష, జ్యోతి, సురేష్, ప్రసన్న, భారతి, రమాదేవి, ఆనంద్‌రెడ్డి

**చింతల్ :** జీవన్, గణేష్, అఖిల, కోమలి, రవిబాబు, వెంకటేశ్వర్రావు, తేజ, శ్రీనివాసరావు, ప్రశాంతి, జశ్వంతరావు, నాగాంజనేయులు, షైని, విజయ, సుధాకర్, సుమంత్, శిల్ప, సోనీ, ఆనంద్‌పాల్, పరిశుద్ధరావు, రాము, శివ, భగత్‌వర్మ, ప్రభాకర్, అజయ్‌కుమార్, వెంకటలక్ష్మి, శ్యామ్‌కుమార్, నాగరాజు, వీణ, కాలేబు, విజయ, దీపిక, సత్యం, దీవెన, నిరీక్షణ్, వెంకటరమణ, అరుణ, శ్రీనివాస్, ఆనంద్‌బాబు, షీబారాణి, విజయ, చిట్టెమ్మ, ప్రవీణ్

**అనాజ్‌పూర్ :** షాలేమురాజు, సిద్ధు, మణి, జ్యోతి, సౌజన్య, విజయలక్ష్మి

**ఇ.సి.ఐ.యల్ :** మాధవి, వెంకటేశ్వర్రావు, సుకుమార్

**'స్పర్శ'** అనే మన ద్విమాస పత్రిక ప్రతి విడి పత్రిక రూ.10/–లు, సంవత్సర చందా రూ. 50/–లు, జీవితకాల చందా రూ. 1000/–లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ____________________

2. చిరునామా: ____________________

____________________

____________________

పిన్ కోడ్: ____________________

**మీ ప్రార్థనావసరతలు:**

____________________

____________________

____________________

____________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్–70, ఫోన్: 040–2420 2227



2012, మే 14,15 మరియు 16వ తేదీలలో హైదరాబాద్ - హెచ్.ఎం.టి. చింతల్ ప్రాంతంలో
జరిగిన సువార్త స్వస్థత సభలలో అనేకులు పాల్గొని, దేవుని ఆరాధించడం జరిగినది.

2012, మే 14,15 మరియు 16వ తేదీలలో హైదరాబాద్ - హెచ్.ఎం.టి. చింతల్ ప్రాంతంలో
సువార్త స్వస్థత సభలు ఆశీర్వాదకరంగా జరుగునట్లు దేవుడు సహాయం చేసారు.






# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org